
సాక్షి పల్నాడు

శనివారం । 30 । నవంబర్ । 2024



లక్ష బిల్వార్చన

నకరికల్లు: నర్సింగపాడులోని గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామికి శుక్రవారం లక్షబిల్వార్చన నిర్వహించారు. విశేష పూజలు, హోమాలు చేశారు.



ఆనందీశ్వరునికి అభిషేకాలు

చెరుకుపల్లి: కార్తిక మాసం, మాసశివరాత్రి సందర్భంగా గుళ్ళపల్లిలోని గంగాంబిక సమేత ఆనందీశ్వర స్వామికి శుక్రవారం 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

త్రికోటేశ్వరునికి రుద్రాభిషేకాలు



నరసరావుపేట రూరల్: మాసశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి శుక్రవారం రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన చేశారు. పుష్పాలంకరణ సేవ జరిపారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: అమరేశ్వరాలయంలో శుక్రవారం దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్ష బిల్వార్చనను అలయ అర్చకులు, వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని చేశారు. స్వామికి విశేష అలంకరణ అనంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు లక్షబిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండేశ్వరి దేవికి లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాశాఖలో భారీగా బదిలీలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉప విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజు గురువారం రాత్రి విడుదల చేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలువురికి స్థాన చలనం కలిగింది. గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా ఉన్న పి.వెంకటేశ్వరరావును పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీఎస్ఈఆర్ఎంసీ) అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.లావణ్యకు సమగ్రశిక్ష ఎస్పీడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా స్థాన చలనం కలిగించగా, ఆమె స్థానంలో ఎస్.శైలజాబాయి నియమితులయ్యారు. నరసరావుపేట డీవైఈవోగా పని చేస్తున్న కె.వేణుగోపాల్‌ను విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయగా, అక్కడ పని చేస్తున్న పీవీ రమణను పల్నాడు డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సమగ్రశిక్ష ఎస్పీడీ కార్యాలయంలో పని చేస్తున్న పి.శ్రీనివాసరావును బాపట్ల జిల్లా ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్తగా నియమించారు. గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా తిరుపతిలో పని చేస్తున్న పీవీఎస్ లక్ష్మీ నారాయణకు పోస్టింగ్ ఇచ్చారు.

ప్రత్యేక అలంకారంలో క్వారీ బాలకోటేశ్వరస్వామి



చేబ్రోలు: కార్తిక మాసం చివరి శుక్రవారం కావటంతో చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. శ్రీరంగపురం గ్రామంలోని మోహనరంగ నాయక స్వామి దేవస్థానంలో మహిళలు గోపూజ చేశారు. సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. చేబ్రోలు నాగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పొన్నూరు: తుపాను నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులలో ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. పొలాల్లో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, తొందరపడి నష్టానికి ధాన్యాన్ని విక్రయించవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరను అందిస్తుందన్నారు. మండలంలో 10 రైసు మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోందని, ఇప్పటికి 8 వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశామని తెలిపారు.

గర్భశోకం

నాలుగు సీహెచ్‌సీలలో గైనకాలజిస్టులు నిల్

- ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది తీవ్ర కొరత
- కాన్పుల కోసం అగచాట్లు పడుతున్న గర్భిణులు
- సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రాక
- నరసరావుపేట ఏరియా వైద్యశాలలో సిబ్బందిపై తీవ్ర పనిభారం



నరసరావుపేట ఏరియా వైద్యశాలలోని గైనిక్ విభాగం ఓపీ వద్ద నిరీక్షిస్తున్న గర్భిణులు

నరసరావుపేట టౌన్ : ప్రభుత్వ వైద్యశాలల్లో గర్భిణుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. మెరుగైన వైద్యసేవలు అందక నరకయాతన అనుభవిస్తున్నారు. ఓ వైపు పురిటి నొప్పులతో సతమతమవతూ.. మరోవైపు సకాలంలో వైద్య సేవలందక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విలవిలలాడుతున్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయం. మాచర్ల నియోజకవర్గంలో విజయపురి సౌత్, ఈపూరు, పెదకూరపాడు, అమరావతి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో గైనకాలజిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెదకూరపాడులో పని చేసే వైద్యురాలు డెప్యూటేషన్‌పై నరసరావుపేటలో పని చేస్తున్నారు. ఈపూరులో పని చేసే వైద్యురాలు గత మార్చిలో బదిలీ అయ్యారు. ఇక్కడకు మంగళవారం, శుక్రవారం వినుకొండ నుంచి డెప్యూటేషన్‌పై వైద్యులు వస్తూ పోతున్నారు. అమరావతిలో రెండేళ్ల పైబడి నుంచి గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉంది. విజయపురిసౌత్‌లో వారంలో రెండు రోజులు పక్క పీహెచ్‌సీల నుంచి వైద్యులు వచ్చి వెళ్తారు. మరో పక్క చాలామందిని ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి సిఫారసు చేయడంతో రద్దీ పెరిగి బెడ్ల కొరత వేధిస్తోంది. దీంతోపాటు ఆస్పత్రిపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. గర్భిణులు కూడా వ్యయప్రయాసలు పడుతున్నారు.

కాన్పులకు హెడ్ నర్సులే దిక్కు..

ఆస్పత్రులకు ప్రసవాల కోసం వచ్చే గర్భిణులకు హెడ్ నర్సులే దిక్కవుతున్నారు. వారే పురుడు పోస్తున్నారు. చేతనైనంత మేరకు చికిత్స అందించి పెద్దాస్పత్రాలకు రిఫర్ చేస్తున్నారు. సిజేరియన్ అయ్యే అవకాశం ఉందనుకుంటే గుంటూరు, నరసరావుపేటకు పంపిస్తున్నారు. అమరావతి, విజయపురిసౌత్, పెదకూరపాడులలో ఇదే దుస్థితి ఉంది. పలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అసలు ప్రసవాలే జరగడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశు సంరక్షణ కార్యక్రమాలను విస్తృతం చేయడానికి ఈ వైద్య కేంద్రాలు కీలకం. ప్రతి సీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షించడానికి స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేశారు. వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉంచారు. అయితే ఆరోగ్య కేంద్రాల్లో నిర్ణీత లక్ష్యం మేరకు కూడా ప్రసవాలు జరగడం లేదు. ప్రతి కేంద్రంలో కనీసం ఏడాదికి 10 ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రజలకు సేవలపై నమ్మకం కలిగించాలని పలు మార్లు ఉన్నతాధికారులు సమావేశాల్లో తెలియజేస్తున్నా.. పరిస్థితిలో మార్పు రావడం లేదు.

40 మందికి 16 మందే

నరసరావుపేట ఏరియా వైద్యశాలలోని సిబ్బంది ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్కరే చేస్తూ తీవ్ర పని భారం మోస్తున్నారు. 200 పడకలు ఉన్న ఈ వైద్యశాలలో 40 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉండగా 16 మందే పనిచేస్తున్నారు. దీంతో సిబ్బంది పని భారం ఎక్కువై మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. రోగులూ అవస్థలు పడుతున్నారు. రేడియాలజిస్టు పోస్టు దీర్ఘకాలికంగా భర్తీకి నోచుకోకుండా ఖాళీగా ఉంది. దీంతో గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఏరియా వైద్యశాల గైనిక్ విభాగంలో నెలకు సుమారు 200 నుంచి 250 వరకు ప్రసవాలు జరుతున్నాయి.



గైనకాలజిస్టు లేని విజయపురి సౌత్ సామాజిక ఆరోగ్య కేంద్రం

సిబ్బంది కావాలని నివేదిక పంపించాం



ఏరియా వైద్యశాలలో 40 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, 16 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. స్టాఫ్ నర్సుల కొరత ఉంది. భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మంత్రునాయక్, ఏరియా వైద్య శాల సూపరింటెండెంట్

ప్రతి సీహెచ్‌సీలో గైనకాలజిస్టు ఉండాలి



జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీలో గైనకాలజిస్టు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా గిరిజనులు, దళితులు అధికంగా ఉండే విజయపురిసౌత్, పెదకూరపాడు, ఈపూరు లాంటి సీహెచ్‌సీలలో గైనకాలజిస్టు లేకపోవడంతో పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది సరిపడా లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. వెంటనే సిబ్బందిని నియమించాలి.

–మేరాజోత్ హనుమంత్‌నాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

పెండింగ్ కేసులను తగ్గించాలి

నేర సమీక్షలో ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన నేర సమీక్షలో అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం, గ్రేవ్, ప్రాపర్టీ, చీటింగ్, మిస్సింగ్ కేసులతోపాటు గంజాయి, సారా కట్టడికి తీసుకోవాల్సిన చర్యల గురించి సమీక్షించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. బాధితుల సమస్యలను ఓపికగా విని న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల కేసుల్లో వేగంగా స్పందించాలని ఆదేశించారు. మహిళా కేసుల విచారణ సందర్భంలో మహిళా పోలీస్ అధికారి, సిబ్బంది ఉండేటట్లుగా చూసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్పీ చెప్పారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని, బహిరంగ మద్యపానాన్ని అరికట్టాలని వివరించారు. ఎమర్జెన్సీ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సారాపై ఉక్కుపాదం మోపాలన్నారు. సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. వివాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఆరోపణలు వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



నేర సమీక్షకు హాజరైన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

ఏపీ జ్యుడీషియల్ టాపర్ మన అమ్మాయే

కృషి, పట్టుదల ఉంటే అనుకున్నది సాధించవచ్చు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి తగ్గట్లుగా శ్రమిస్తే కోరుకున్న ఏ రంగంలోనైనా రాణించవచ్చు. క్రమశిక్షణ, అంకితభావం, సమాజానికి మంచి చేయాలన్న తపన ఇవే ఎవరినైనా ఉన్నత స్థానంలో నిలబెడతాయి. సరిగ్గా ఈ కోవకు చెందినవారే యర్రం షాలినిరెడ్డి. ఆమె ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆమె పూర్వీకులు పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడు నుంచి తెలంగాణలోని మంచిర్యాలకు వలస వెళ్లారు.



- పల్నాడు జిల్లా నుంచి మంచిర్యాల జిల్లాకు వలస
- తెలంగాణాలో స్థిరపడి అక్కడే విద్యాభ్యాసం
- తెలంగాణ జ్యుడీషియల్ పరీక్షల్లో చేజారిన అవకాశం

సత్తెనపల్లి: యర్రం కరుణాకర్‌రెడ్డి, రేఖ దంపతుల కుమార్తె షాలినిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి మంచిర్యాలలో ప్రైవేట్ విద్యాసంస్థను స్థాపించారు. రేఖ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. చిన్నతనం నుంచి కష్టపడే తత్వం కలిగిన షాలినిరెడ్డి టెన్త్‌లో 97 శాతం మార్కులతో, ఇంటర్మీడియట్‌లో 97 శాతం మార్కులతో టాపర్‌గా నిలిచారు. ఎల్ఎల్‌బీ, హైదరాబాద్ అడల్ రామిరెడ్డి కళాశాలలో, ఎల్ఎల్ఎం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేసి టాపర్‌గా పేరు తెచ్చుకున్నారు. తెలంగాణలో ఎన్‌రోల్ చేసుకుని కొంతకాలం ప్రాక్టీస్ కూడా చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసులో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆమె పోటీ పడ్డారు. త్రుటిలో అవకాశం కోల్పోయారు. దీంతో మరింత పట్టుదలతో షాలినిరెడ్డి కష్టపడ్డారు. ఈ ఏడాది జనవరిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జ్యుడీషియల్ సర్వీస్‌లో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేశారు. ఆగస్టులో గుంటూరు జిల్లా నల్లపాడులో ప్రిలిమినరీ రాశారు. సెప్టెంబర్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాత పరీక్ష, వైవాలో ప్రతిభ కనబర్చి 238.67 మార్కులతో 68.19 శాతం సాధించారు. ఈనెల 6న ముఖాముఖిలో ప్రతిభ చూపారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో మొదటి స్థానం దక్కించుకొని ఏపీ టాపర్‌గా నిలిచి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆమె జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో పల్నాడు జిల్లాలోని ఆమె బంధువులు మురిసిపోయారు. సత్తెనపల్లి, లంకెలకూరపాడుల్లోని పలువురు శుక్రవారం ఆమెకు ఫోన్ చేసి అభినందించారు.

ప్రతి ఓటమి ఓ పాఠం

జ్యుడీషియల్ పరీక్షలు రాయాలంటే పట్టుదల ప్రధానం. నేను రెండో యత్నంలో విజయం సాధించాను. ఎంతో మానసిక ఒత్తిడి ఉంటుంది. దాన్ని తట్టుకుంటూ సీనియర్లు, జూనియర్లతో చర్చించి తప్పిదాలపై సమీక్షించుకుని ముందుకు సాగాను. ఎన్ని గంటలు చదివామనేది ముఖ్యం కాదు. శ్రద్ధపెట్టి గంట చదివినా చాలు. ప్రతి ఓటమి ఓ పాఠంలా ముందుకు సాగాలి. మనసు పెడితే సాధించలేనిది ఏదీ లేదు.

–యర్రం షాలినిరెడ్డి



తల్లిదండ్రులు కరుణాకర్‌రెడ్డి, రేఖలతో షాలినిరెడ్డి

'మీతో మేము' 24/7



'మీతో మేము' కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు తదితరులు

- ప్రజలకు నిరంతర పోలీసు సేవలు
- నేరాలపై అవగాహన
- వినూత్న కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ శ్రీకారం
- మూడు ట్రాఫిక్ ద్విచక్రవాహనాలు ప్రారంభం
- ప్రతి పోలీసుస్టేషన్ వద్ద డిజిటల్ డిస్‌ప్లేలు



ట్రాఫిక్ ద్విచక్రవాహనాలను నడిపి ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లాలోని అన్నీ పోలీస్‌స్టేషన్లలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించనున్నట్టు కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జిల్లా పోలీసుశాఖ రూపొందించిన 'మీతో – మేము' అనే వినూత్న కార్యక్రమాన్ని ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేకంగా సమకూర్చిన మూడు ద్విచక్ర వాహనాలను నడిపి వాటిని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రూపొందించిన ఎస్పీ అభినందనీయులని అన్నారు. నేరాలపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మీతో మేము, మీ రక్షణ – మా బాధ్యత అనే కార్యక్రమం ద్వారా 24/7 పోలీసు సేవలు అందించేందుకు పునరంకితమయ్యామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ రిసెప్షన్ల వద్ద డిజిటల్ డిస్‌ప్లే స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రజలకు నేరాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ డిజిటల్ స్క్రీన్లు శాటిలైట్ సిస్టంతో పనిచేస్తాయన్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని వివరించారు. మహిళల భద్రతకు కట్టుదిట్ట చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని 34 పోలీస్ స్టేషన్లలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. వీటిని త్వరలో విద్యాసంస్థలు, హాస్పిటళ్లు, జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, కె.హనుమంతరావు, జగదీష్, దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

• వేదాశీర్వచనం



మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ దంపతులు శుక్రవారం అమరావతిలోని అమరేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు కోవింద్ దంపతులకు వేదాశీర్వచనం అందించారు. – అమరావతి





పంచకోటీశ్వరా నమో!

పిడుగురాళ్ల బోళా లింగేశ్వరస్వామి దేవస్థానం 18వ వార్షికోత్సవంతోపాటు కార్తిక మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి భక్తులు ఐదు కోట్ల ఒత్తులతో శివలింగం, ఓం ఆకారంలో దీపారాధన చేశారు. ఆవు నెయ్యితో ఒత్తులను వెలిగించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. – పిడుగురాళ్ల

క్లుప్తంగా

కూటమి హామీలపై పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్



నరసరావుపేట: ఎన్‌డీఏ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేస్తామని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. వచ్చే నెల 6,7,8 తేదీలలో నరసరావుపేట పట్టణంలో ప్రకాష్‌నగర్‌లోని షాదీఖానాలో నిర్వహించే పార్టీ 25వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల ప్రారంభ సూచికగా ఆరో తేదీన సత్తెనపల్లి రోడ్డులోని కోట సెంటర్ నుంచి పల్నాడు బస్టాండ్ వరకు ప్రదర్శన అనంతరం బహిరంగసభను జయప్రదం చేయాలన్నారు. ప్రధాన వక్తలుగా పార్టీ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కామ్రేడ్ పెనుమల్లి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ చిగురుపాటి బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వి.క్రిష్ణయ్య, హరికిషోర్ పాల్గొంటారని వివరించారు. సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ పోరాటాలకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

మళ్లీ భూ సర్వే ప్రారంభం

నరసరావుపేట: గత ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన భూ సర్వేను పురపాలక సంఘ పరిధిలో మళ్లీ అధికారులు చేపట్టారు. ఈ మేరకు పట్టణంలోని సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ఇల్లిల్లూ తిరుగుతూ ఇళ్ల, స్థలాల కొలతలు, డాక్యుమెంట్లను అడిగి తీసుకుంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సర్వేకు పేరు మార్చింది. ఏపీ రీసర్వే ప్రాజెక్ట్ అనే పేరుతో సర్వే చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వంలోని నీతిఅయోగ్ ప్రవేశపెట్టిన ఈ సర్వేను గత ప్రభుత్వం అమలు చేసింది. అప్పట్లో జరిగిన సర్వేపై ఎన్‌డీఏ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో అనేక ఆరోపణలు గుప్పించారు. అధికారంలోకి రాగానే దీనిని రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు కూడా. గత ఎన్నికల సమయం నాటికి పట్టణంలో 30శాతం వరకు సర్వే పూర్తయింది. అయితే మిగిలిన సర్వేను చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కార్యదర్శులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో ఆపేసిన సర్వేను మళ్లీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి ఇళ్ల, ఖాళీ స్థలాలు, వ్యాపార సముదాయాల యజమానులు సహకరించాలని కమిషనర్ కోరారు.

సోలార్ పవర్ ప్రాజెక్టు కోసం భూములకు హద్దులు గుర్తింపు

జిల్లా సర్వే అధికారి భానుకీర్తి

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం గ్రామ శివారుల్లోని సత్రశాల వద్ద సోలార్ పవర్ ప్రాజెక్టు నిమిత్తం శుక్రవారం రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూములకు హద్దులను గుర్తించినట్లు పల్నాడు జిల్లా సర్వే అధికారి సీహెచ్ భానుకీర్తి తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్టుకు భూమి కేటాయించాలని కలెక్టర్‌కు ఏపీ జెన్‌కో అధికారులు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో గురువారం ఆర్డీఓ మురళీకృష్ణ సర్వే నంబర్ 883 నంబర్‌లోని భూములను పరిశీలించారు. దీనిలో భాగంగానే శుక్రవారం ఉదయం భానుకీర్తి నేతృత్వంలోని జిల్లా సర్వే అధికారులు ఆ భూములను పరిశీలించి 100 ఎకరాలకు హద్దులను గుర్తించారు. ఈ భూమికి రెవెన్యూ రికార్డుల ప్రకారంగా ఎటువంటి ఆటంకాలూ లేవని ఆమె చెప్పారు. పూర్తి నివేదికను గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణకు అందజేస్తామని పేర్కొన్నారు.



భూముల రికార్డులను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా సర్వే అధికారి భానుకీర్తి

ఆమె వెంట జిల్లా సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, డివిజనల్ సర్వే ఆఫ్ ఇన్స్‌పెక్టర్ వి.శ్రీనివాసరావు, ఆర్ఐ పల్లా రామకృష్ణ, వీఆర్వో పాపారావు, సర్వేయర్లు ఎస్.రవీంద్రారెడ్డి, అర్జున్, సైదావలి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి

నరసరావుపేట టౌన్: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్వో మురళిని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్ఏలకు తెలంగాణ రాష్ట్రం మాదిరి పేస్కేల్ అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ తదితర పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జిల్లా పరిధిలో రెండు మండలాలలో వీఆర్ఏల వేతనాలకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయ అధికారులు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. నిబంధనల మేరకు డ్యూటీ సర్టిఫికెట్లు అడగడం అన్యాయమన్నారు. అలాగే అక్రమ డ్యూటీలు రద్దు చేయాలని, డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట మండల అధ్యక్షులు రోశయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, రొంపిచర్ల మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్ఓ మురళికి వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏ సంఘ ప్రతినిధులు

సంప్రదాయ ఆహార తయారీ డిజిటలైజేషన్ అవసరం

తెనాలి: ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఏపీసీసీఐఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం ఆరంభమైన బిజినెస్ ఎక్స్‌పో-2024లో తొలిరోజున ఆహార ప్రాసెసింగ్‌పై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. డిసెంబరు ఒకటో తేదీ వరకు జరిగే బిజినెస్ ఎక్స్‌పోలో ఆహార పరిశ్రమల నిపుణులు, ఆవిష్కర్తలు, వాటాదారులు పాల్గొంటున్నారు. తొలిరోజున ఎక్స్‌పో దేశం గొప్ప పాకశాస్త్ర వారసత్వాన్ని పరిరక్షించటంలో ఆవిష్కరణ ప్రాముఖ్యతను నొక్కిచెప్పింది. ఆహార పరిశ్రమ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన తెనాలిలోని డబుల్‌హార్స్ సంస్థ జనరల్ మేనేజర్ పీఎస్‌వీ కృష్ణప్రసాద్ ఈ సదస్సులో కీలకోపన్యాసం చేశారు. 'బ్లెండింగ్ ట్రెడిషన్ విత్ ఇన్నోవేషన్స్- ది సైన్స్ ఆఫ్ ఇండియన్ ట్రెడిషనల్ ఫుడ్స్ ఇన్ మోడర్న్ ఫుడ్ ప్రాసెసింగ్' అంశంపై ఆయన ప్రసంగించారు. సంప్రదాయ ఆహార తయారీ పద్ధతులను డిజిటల్‌గా మార్చాల్సిన ఆవశ్యకతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ రకంగా వాటి ప్రామాణికమైన రుచి, పోషక విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు సంరక్షించాలని సూచించారు. ఈ చొరవకు నాయకత్వం వహించటంలో, సాంకేతికతతో సంప్రదాయాన్ని ఏకీకృతం చేయడానికి ఒక స్థిరమైన నమూనా రూపకల్పనలో అమరావతి విద్యాసంస్థలు, పరిశ్రమల పాత్రను ఆయన గుర్తుచేశారు. ప్రసంగం అనంతరం కృష్ణప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.



బిజినెస్ ఎక్స్‌పోలో కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అంతర్ పంటలతో ఆదాయం అధికం

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): రబీ సీజన్‌లో అంతర్ పంటలు సాగు చేయటం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రకృతి వ్యవసాయం మండల కోఆర్డినేటర్లకు పిట్టలవానిపాలెంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, అంతర్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. డీపీఎం వాణిశ్రీ మాట్లాడుతూ అంతర్ పంటల సాగు వల్ల చీడపీడలను నివారించుకోవచ్చని చెప్పారు. మినుములో నల్లనువ్వులు, ఆవాలు, పచ్చ జొన్నలు, గోంగూర పైర్లు సాగు చేయవచ్చని సూచించారు. వేరుశనగ పైరులో పొద్దు తిరుగుడు నల్లనువ్వులు, ఆవాలు, గోంగూర, సజ్జ లాంటి పైర్లు సాగుచేసి అదనపు ఆదాయం పొందాలని చెప్పారు. అనంతరం దశపర్ణి కషాయం, బీజామృతం తదితర కషాయాల తయారీపై కో- ఆర్డినేటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం బాపట్ల మాస్టర్ ట్రైనర్ గంజి శ్రీకాంత్, మండల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పెన్షనర్లకు 50 శాతం ఐఆర్ మంజూరు చేయాలి

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలోని 4 లక్షల మంది పెన్షనర్లకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును వినతిపత్రం ద్వారా కోరినట్లు పెన్షన్‌దారుల చర్చా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించినప్పటికీ కార్యాలయం ఏర్పాటు, సిబ్బంది నియామకం జరగలేదని, నివేదిక ఎప్పటికి వస్తుందో తెలీదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులు, పెన్షనర్ల ఆగ్రహాన్ని చల్లబరిచేందుకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీగంగాధర్‌రావు

పిడుగురాళ్ల: ప్రతి మనిషి ఆరోగ్యమే మహాభాగ్యమని పిడుగురాళ్ల మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.మురళీగంగాధర్‌రావు చెప్పారు. పిడుగురాళ్ల పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కుమారస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం. మురళీగంగాధర్‌రావు హాజరయ్యారు. ముందుగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా షుగర్, బీపీ టెస్టులు నిర్వహించటం ఆనందమన్నారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ అసిస్టెంట్ సాయిబాబా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, సెక్రటరీ వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ మెంబర్లు కోటేశ్వరరావు, అచ్చారావు, ఎం.వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, జాకబ్, సాగర్, రామకృష్ణ, ఉడతా కోటేశ్వరరావు, పలువురు న్యాయవాదులు, మెడికల్ అసిస్టెంట్లు మహ్మద్ నహీమ్, కె. మాధవ్, కె.బషీర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీ గంగాధర్‌రావుకు బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సత్రశాలలో జిల్లా సర్వే అధికారి పూజలు

సత్రశాల(రెంటచింతల): కార్తిక మాసం సందర్భంగా సత్రశాలలోని గంగా భ్రమరాంబికాదేవి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోని పల్నాడు జిల్లా సర్వే అధికారి భానుకీర్తి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ప్రధాన అర్చకులు చిట్టేలా మల్లికార్జునశర్మ నేతృత్వంలో స్వామికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు గణపతి, రుద్ర హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మాలధారులు, పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. దేవస్థాన ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన స్ఫటిక శివలింగం వద్ద, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సాయంతో సుమారు 1500 మంది భక్తులకు, మాలధారులకు మహాన్నదానం చేశారు. ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అన్నదాన కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య, మున్నా లింగయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న భానుకీర్తి

7న మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం

విజయవంతం చేయాలని డీఈవో సూచన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం జరగనుందని, దానిని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. శుక్రవారం బ్రాడీపేటలోని శ్రీశారదా నికేతన్ ఓరియెంటల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతోపాటు సమగ్రశిక్ష భవిత కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులతో సంస్కృతంలో శ్లోకాలను చదివించడంతోపాటు టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన అమలు తీరుతెన్నులను పరిశీలించారు. విద్యార్థినులు అత్యధిక సంఖ్యలో మధ్యాహ్న భోజనం ఆరగించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రధానోపాధ్యాయురాలు ఉషాకుమారితో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాశరావు, ఎన్నారై కాంద్ర అప్పారావు, లక్ష్మారెడ్డి రూ.50 లక్షల వ్యయంతో తరగతి గదుల నిర్మాణానికి ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. దీంతోపాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.2.50 లక్షలతో బెంచీలు, తాగునీటి సదుపాయాన్ని కల్పించిన విషయం గురించి డీఈవో రేణుక తెలుసుకున్నారు. భవిత కేంద్రానికి వెళ్లి చిన్నారుల్లోని ప్రతిభా నైపుణ్యాలను పరిశీలించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన తిలకించి, వారిని అభినందించారు. శారీరక, మానసిక లోపాలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించిన తీరును మెచ్చుకున్నారు. ఉపాధ్యాయులను కూడా అభినందించారు.



విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో రేణుక

రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించండి

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ ఆదేశించారు. శుక్రవారం తుళ్ళూరులోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు విన్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. భూ వ్యవహారాలు 45, ప్రణాళికా విభాగం 2, భూ సర్వే 1, డెవలప్‌మెంట్ ప్రమోషన్‌లకు సంబంధించి 2 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్ డేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి. రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, పలువురు తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు వింటున్న ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్

మూడేళ్ల చిన్నారిపై లైంగికదాడికి వృద్ధుడు యత్నం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

చినగంజాం: మూడేళ్ల చిన్నారిపై తాత వరుస అయ్యే వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శీలం రమేష్ అందించిన సమాచారం ప్రకారం.. బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని ఓ గ్రామానికి చెందిన భార్యాభర్తలు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ గ్రామంలో పెళ్లికి హాజరయ్యేందుకు మంగళవారం తమ మూడేళ్ల చిన్నారిని తీసుకొచ్చారు. బాగా పొద్దుపోయేంత వరకు పెళ్లి హడావుడిలో ఉన్న వారు అలసిపోయి బుధవారం ఉదయం వరకు ఇంటిలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో వారి మూడేళ్ల కుమార్తె ఇంటి బయట ఆడుకుంటోంది. అదే కాలనీకి చెందిన చిన్నారికి తాత వరుస అయిన 60 ఏళ్ల చాట్ల అంజయ్య ఇంటి బయట తన ఈడు పిల్లలతో ఆడుకుంటున్న చిన్నారిని ఉద్దేశపూర్వకంగా ఇంటి సమీపంలో ఉన్న జొన్న చేనులోకి తీసుకెళ్లాడు. అక్కడ చిన్నారికి ముద్దులు పెడుతూ లైంగికంగా వేధిస్తుండటంతో బాలిక పెద్దగా కేకలు వేసింది. ఆ సమయంలో ఉపాధి పనులకు వెళుతున్న స్థానిక యువకులు, మహిళా కూలీలు కేకలు విని అక్కడకు వచ్చి అంజయ్యను గట్టిగా మందలించడంతో అతడు తప్పు జరిగిపోయింది తనను క్షమించాలని కోరాడు. దాంతో వారు అతనిని మందలించి చిన్నారిని ఇంటి దగ్గర వదలిపెట్టి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ఉపాధి కూలీల్లోని ఓ మహిళ 28వ తేదీ చిన్నారి తల్లితో పాటు మరికొందరు మహిళలతో పిచ్చాపాటి మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పింది. ఆమె సమాచారం భర్తకు చెప్పడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు చాట్ల అంజయ్యపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకున్న 'సన్‌రైజింగ్ ఆంధ్రప్రదేశ్'



అంతర్జాతీయ సైకత శిల్పి బాలాజీ వరప్రసాద్ ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం సీతానగరం కృష్ణానది ఇసుక తిన్నెల్లో శుక్రవారం 'సన్‌రైజింగ్ ఆంధ్రప్రదేశ్'పై సైకత శిల్పం తీర్చిదిద్దారు. ఒడిశా ప్రభుత్వం నిర్వహించే శాండ్ ఆర్ట్ పోటీల్లో మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ నుంచి బాలాజీ వరప్రసాద్ ప్రథమ స్థానం సాధించి హ్యాట్రిక్ విజేతగా నిలిచారు. కృష్ణానది తీరంలో సైకత శిల్పం చెక్కి విద్యార్థులకు శాండ్ ఆర్ట్‌పై అవగాహన కల్పించారు. –తాడేపల్లి రూరల్

జామతోట పీకేసిన దుండగులు

నకరికల్లు: గుర్తుతెలియని దుండగులు జామతోటలోకి ప్రవేశించి రాత్రికి రాత్రే తోట మొత్తం పీకేశారు. ఈ ఘటన మండలంలోని శివాపురంతండా సమీపంలో శుక్రవారం జరిగింది. నకరికల్లు పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన బాధిత రైతు పేరం వెంకటేశ్వరరెడ్డి కథనం ప్రకారం.. వెంకటేశ్వరరెడ్డి శివాపురంతండా సమీపంలో జామతోటతోపాటు కరివేపాకు, మునగ తదితర పంటలు సాగు చేసుకుంటున్నాడు. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న జామతోటలో గురువారం కూలీలతో కలుపు తీయించాడు. తిరిగి శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లే సరికి కాపుదశలో ఉన్న జామతోట మొత్తం పీకేసినట్లు గుర్తించిన రైతు కన్నీరుమున్నీరయ్యాడు. రాత్రికి రాత్రే తోటలోని మొక్కలన్నీ పీకేసిన దుండగులు మొక్కలను కట్టలు కట్టి దూరంగా పడేశారు. దుండగులు చేసిన పనికి తనకు రూ.3 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించాడు.

రిషితేశ్వరికి దక్కని న్యాయం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్

లక్ష్మీపురం: రిషితేశ్వరి కేసు కొట్టి వేస్తూ కోర్టు తీర్పు వెలువరించడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో కిరణ్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక చనిపోయిన విద్యార్థికి న్యాయం చేయకుండా ఇలాంటి తీర్పులు న్యాయస్థానాలు ఇవ్వటం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. తక్షణమే రిషితేశ్వరి కేసులో నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2015 జూలై 14వ తేదీన ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి అనే విద్యార్థిని ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరి వేసుకొని చనిపోయిందన్నారు. సూసైడ్ నోట్ లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని, తనని సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని వివరంగా రాసిందన్నారు. ఈ కేసులో ముగ్గురు విద్యార్థులను, అప్పటి ఆర్కిటెక్చర్ కాలేజ్ ప్రిన్సిపల్ బాబురావును నిందితులుగా కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. తొమ్మిది సంవత్సరాల నుంచి కేసు విచారణ నడుస్తోందని, కేసు కొట్టివేస్తూ కోర్టు తీర్పు చెప్పడం రిషితేశ్వరికి అన్యాయం చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, సుభాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కిరణ్, సమీర్, యశ్వంత్, సుభాని

సోషల్ మీడియా కార్యకర్తకు బెయిల్ మంజూరు

నగరంపాలెం: సోషల్ మీడియా కార్యకర్తకు జిల్లాలోని కోర్టులో బెయిల్ మంజూరు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారనే నెపంతో వైజాగ్‌కు చెందిన వైజాగ్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జి.వెంకటేష్‌పై ఐటీడీపీ వల పట్టాభిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెంకటేశ్‌ను శుక్రవారం గుంటూరులోని ఆరో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు, సీబీసీఐడీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. జడ్జి కె.శృతవింద బెయిల్ మంజూరు చేశారు. వెంకటేశ్ తరుపున న్యాయవాది మొండితోక శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ వాదించారు.

ఫుల్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలను పెంచాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గురుకుల విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఫుల్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయుల వేతనాలను పెంచాలని కోరుతూ ఆర్థికశాఖ కార్యదర్శి జానకిని వెలగపూడిలోని సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ గురుకుల విద్యాసంస్థల్లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఫుల్ టైం గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు గౌరవ వేతనాన్ని 50 శాతం వరకు పెంచాలని ఎంతో కాలంగా చేస్తున్న వినతుల ఫలితంగా సంబంధిత శాఖ నుంచి ఫైల్‌ను జానకికి అందజేసినట్లు పేర్కొన్నారు. దీనిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.